క్లుప్తంగా

కల్వర్టు పరిశీలన



కల్వర్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని తక్కెళ్ల పహాడ్, తడకమళ్ల గ్రామాలకు వెళ్లే దారిలో ముల్కలకాల్వ మేజర్ కాలువపై ఉన్న కల్వర్టు కూలిపోయి ప్రమాదకరంగా ఉందని, నూతన కల్వర్టు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వరేపల్లి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం సమస్యల అధ్యాయన యాత్రలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో కల్వర్టులు, దారులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యవర్శి రవినాయక్, చౌగాని సీతారాములు, వెంకన్న, హుస్సేన్, గుండు నాగయ్య, శంకర్, రాము, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షీటీంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని అభ్యాస్ స్కూల్‌లో విద్యార్థులకు షీ టీంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. షీటీం పనితీరును వివరించారు. స్త్రీలు, మహిళలు, విద్యార్థులు, యువత ఇంటా, బయట ఎదుర్కొంటున్న సమస్యలపై ఏవిధంగా షీటీం ను ఆశ్రయించాలనేది తెలిపారు. ఎదైన ఇబ్బందులు ఎదరైతే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ప్రభాకర్, జి.రవీందర్, బీసీ జేఏసీ నాయకులు చేగొండి మురళియాదవ్, కరస్పాండెంట్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

చందంపేట : మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో లబ్ధిదారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి పరిశీలించారు. లబ్ధిదారులు, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. దశల వారిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారుల ఖాతాల్లో న గదు జమ అవుతుందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీడీఓ లక్ష్మి, హరికృష్ణ, సీనియర్ అసిస్టెంట్ హబీబ్, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.


విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

నాగార్జునసాగర్: హిల్‌కాలనీలోని బాలవిహార్ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మహారాజుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నోట్‌బుక్స్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ ధనంతో పొందలేని గౌరవాన్ని విద్యతో పొందవచ్చని, విద్యార్థులు బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ప్రసాదరావు, సతీష్, నరసింహరావు మహారాజుల సేవా సంఘం అధ్యక్షుడు బద్రి, పుల్లారావు, వీరబాబు, నకుల్‌రావు, దుర్గయ్య, శివ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

హాలియా : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలు పూర్తిగా విఫలమైందని సీపీఎం పార్టీ అనుముల మండల కార్యదర్శి అవుత సైదులు అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కోరే రమేష్, పాదిల వెంకన్న, రెబెల్లి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డిపోలో గ్రీవెన్స్ డే నిర్వహించాలని వినతి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించుకునేందుకు డిపోలో గ్రీవెన్స్ డే నిర్వహించాలని కోరుతూ మంగళవారం ఆర్టీసీ డీపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డికి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో హైదరాబాద్ జోనల్ అధ్యక్షుడు అనిమళ్ల నర్సింహ, రీజినల్ కార్యదర్శి కడియం రమేష్, డిపో అధ్యక్షుడు దైద బాల, కార్యదర్శి డి.భాగ్యరాజ్, సహాయ కార్యదర్శులు ఆర్.జాయ్‌మేర్సీ, బాలునాయక్, తివారి, కేపీ సింగ్‌ఉన్నారు.

అస్తవ్యస్తంగా వైకుంఠధామం

- చిన్నఅడిశర్లపల్లిలో నాసిరకం పనులతో కూలిన రేకులు
- మూడేళ్లలోనే శిథిలావస్థకు చేరిన గదులు
- పట్టించుకోని అధికారులు

కొండమల్లేపల్లి : పేద ప్రజల కోసం, భూములు లేని నిరుపేదల కోసం మృతదేహాలను దహనం చేయడానికి ప్రతీ గ్రామ పంచాయతీల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షలు వెచ్చించి వైకుంఠధామాలను నిర్మించారు. కాని ప్రస్తుతం వాటి నిర్వహణ పరిస్థితి మాత్రం అస్తవ్యస్తంగా ఉంది. ముఖ్యంగా కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీలో నిర్మించిన వైకుంఠధామం రేకులు కూలి పోయాయి. ఈ వైకుంఠధామాన్ని రెండు విడతలుగా నిర్మించారు. మొదటి విడతలో ఈజీఎస్ నిధుల క్రింద రేకులతో గదులను నిర్మించారు. రెండో విడతలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ నిధుల క్రింద స్లాబ్‌లతో గదులను నిర్మించారు. అయితే చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీలోని వైకుంఠధామాల గదులను మొదటి విడతలో రూ.12లక్షలఅంచనా విలువతో రేకుల గదులను నిర్మించి వాటిని 2022లో అప్పటి నియోజకవర్గ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ ప్రారంభించారు. కాని కాంట్రక్టర్ నాసిరక పనులతో రేకులు, ఇనుప రాడ్లు కూలిపోవడంతో ఆ గదులు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం ఆ గదులు మహిళలకు పనికిరాకుండా పోయాయి. పలుమార్లు అధికారులు కాంట్రక్టర్‌కు తెలిపినప్పటికీ పట్టించుకోలేదని అంటున్నారు.



కూలిన రేకులతో పైకప్పు లేని మొండి గోడలు



చిన్నఅడిశర్లపల్లి వైకుంఠధామం

పట్టించుకోని కాంట్రాక్టర్

చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీలో నిర్మించిన వైకుంఠధామంలోని రేకుల షెడ్డు గదుల పైకప్పు రేకులు పూర్తిగా కూలి పోవడంతో ఆ గదులు శిథిలావస్థకు చేరాయి. లక్షలు వెచ్చించి నిర్మించినప్పటికి మూడేళ్ల కాలంలోనే ఆ గదులు పాడైపోవడం కాంట్రాక్టర్ చేసిన నాసిరకం పనులకు నిదర్శనం అని చెప్పొచ్చు. కాని అధికారులు పలుమార్లు గుత్తేదారుకు బాగుచేయించమని చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. అధికారులు బాగుచేయించడానికి పంచాయతీలో నిధులు లేకపోవడంతో ఆ గదునలు అలాగే వదిలేశారు.

> **గదులను బాగుచేయిస్తాం**
>
> మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీలో నిర్మించిన వైకుంఠదామాల లోని గదుల రేకులు కూలి పోవడం వాస్తమే. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడం వల్ల ఇలాంటి పరిస్థితి తలెత్తింది. గ్రామ పంచాయతీ నిధులు విడుదల కాగానే ఆ గదులను బాగుచేయిస్తాం.
>
> – బాలరాజురెడ్డి, ఎంపీడీఓ, కొండమల్లేపల్లి

సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : ప్రజా సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. మార్నింగ్ వాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మంగళవారం దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి గ్రామంలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలు సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీకి రెండు కళ్ల లాంటివని అన్నారు. గ్రామస్థాయిలో గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం రూ.50లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ డానియల్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, సురేష్‌గౌడ్, సిరాజ్ ఖాన్, వెంకట్‌రెడ్డి, కొర్ర రాంసింగ్, కిన్నర హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్

చెక్కుల పంపిణీ..

కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకల కెనాల్‌లో ముంపునకు గురవుతున్న భూములకు సంబంధించి పలువురు రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నష్టపరిహారం చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేసి మాట్లాడారు. ముంపు బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీల, ఇరిగేషన్ ఈఈ నెహ్రూ, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చందంపేట : శ్రావణ మాసం పురస్కరించుకొని నేరెడుగొమ్ము మండల కేంద్రంలో మంగళవారం యాదవులు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ తల్లి పూజలో భాగంగా ఇంటింటికీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అనిల్ యాదవ్, వెంకటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

త్రిపురారం : మండలంలోని లోక్యాతండా గ్రామానికి చెందిన నేనావత్ వెంకటేశ్వర్లు నాయక్ సోమవారం మిర్యాలగూడ మండలంలో చింతపల్లి రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మంగళవారం గ్రామస్తులతో సమాచారం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి లోక్యాతండాలో వెంకటేశ్వర్లు నాయక్ ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ వెంకటేశ్వర్లు నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతర బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హనుమంతు నాయక్, కాంతారావు నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించడంలో విఫలం

పెద్దఅడిశర్లపల్లి : భూసమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్గూరి వల్లపురెడ్డి ఆరోపించారు. మంగళవారం గుడిపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధరణి పేరును రద్దు చేసి తీసుకువచ్చిన భూభారతి చట్టం వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. భూభారతిలో దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నూతనంగా ఏర్పడిన మండలంలోని కార్యాలయాల్లో సిబ్బందిని కూడా నియమించలేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు అర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి, సుధాకర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, భిక్షం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

టీఎల్‌ఎంతో విద్యార్థులకు మేలు



ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్‌ఎం ఉపకరణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

వేములపల్లి : టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం)తో చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ బి.హేమలత, ఎంపీడీఓ డి.జితేందర్‌రెడ్డి, ఎంఈఓ బి.లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండలంలోని 18 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శనలో ఉంచిన తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించిన ఉపకరణాలను పరిశీలించి మాట్లాడారు. టీఎల్‌ఎంతో విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో రాణించి చదువులో ముందంజలో ఉంటారని అన్నారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పది మంది ఉపాధ్యాయులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బి.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

మిర్యాలగూడ : నాలా నిబంధనలను ఉల్లంఘించి చేసిన అక్రమ రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలని జప్తీవీరప్పగూడెం గ్రామస్తులు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను కోరారు. మంగళవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ జప్తివీరప్పగూడెం గ్రామ పరిధిలోని పలు సర్వే నంబర్లలో 102 ఎకరాలను 2007లో కోరమండల్ షుగర్స్ లిమిటెడ్ చెన్నై వారు కొనుగోలు చేసి.. రైతులకు ఉద్యోగాలు, ఇంటి వసతి, ఆసుపత్రి, గుడి, మసీద్ నిర్మించి ఇస్తామని నమ్మించి వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేసుకున్నారని తెలిపారు. సుమారు 18 సంవత్సరాల తరువాత సదరు కంపెనీ ఆ భూములను ద్వారక రియల్ ఎస్టేట్ వారికి విక్రయిస్తూ అగ్రిమెంట్ చేసుకోవడంతో గ్రామస్తులమంతా వ్యతిరేకించి హైకోర్టును ఆశ్రయించగా.. ఆ కేసు నడుస్తోందని తెలిపారు. కోర్టులో కేసు ఉండగానే ఈనెల 12న నాలా నిబంధనలకు విరుద్ధంగా 40 ఎకరాలను ఐదుగురి పేర్లమీద రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్‌కె.జందా, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

వేములపల్లి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వేములపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి సుచరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఆశాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రభుత్వం ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం (సీఐటీయూ అనుబంధం) మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా పుట్టల రాధిక, కార్యదర్శిగా చెవుల దేవకమ్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడిరెక్క వెంకన్న, వడ్డెగాని సైదులు, ఆశాలు రజిత, దేవకమ్మ, సుజాత, విఘ్నేశ్వరి, రేణుక, ఝాన్సీ, లక్ష్మి పాల్గొన్నారు.



వేములపల్లి పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు, సీఐటీయూ నాయకులు

గుర్రంపోడు ఎంపీడీఓగా విజయ్‌భాస్కర్

గుర్రంపోడు : ఎంపీడీఓగా మేకల విజయ్‌భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మునుగోడు ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మేకల విజయ్ భాస్కర్ ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘన స్వాగతం లపలికారకార్యాలయ సూపరింటెండెంట్ జి. శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రఘు

పెద్దవూర: పెద్దవూర మండల తహసీల్దార్‌గా వై.రఘు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం అనుముల మండల నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తూ తహసీల్దార్(ఎఫ్‌ఏసీ)గా డిప్యూటేషన్ ద్వారా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వై.శ్రీనివాసరావు కలెక్టరేట్ లీగల్ సెల్‌కు డిప్యుటేషన్‌పై బదిలీపై వెళ్లారు.

మధుర క్షణాలను శాశ్వతంగా నిలిపేదే ఫొటోగ్రఫీ



ఫొటో గ్రాఫర్ నరసింహారావును సన్మానిస్తున్న మాజీమంత్రి జానారెడ్డి



సాగర్ డ్యాం దిగువన ఫొటోగ్రఫీ దినోత్సవంలో ఫొటోగ్రాఫర్లు

నాగార్జునసాగర్ : ఫొటోగ్రఫీ మనిషి జీవితంలోని మధుర క్షణాలను శాశ్వతంగా నిలుపుతుందని సాగర్ ఫొటోగ్రాఫర్స్ అసోషియేషన్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగార్జునసాగర్ డ్యాం దిగువన 186వ ప్రపంచ ఫొటోగ్రఫీదినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు రిటైర్ ఫొటోగ్రాఫర్ శంకరయ్య, కనకరాజు, నరసింహ, నరేందర్, వెంకటేశ్వర్లు, అప్పారావు, కోదండం, వెంకటేశ్, ధనరాజ్, తాతీలు, ప్రసాద్ స్వతంత్ర తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌ను సన్మానించిన మాజీ మంత్రి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫొటో గ్రాఫర్ నర్సింహారావును మాజీమంత్రి కుందూరు జానారెడ్డి నాగార్జునసాగర్‌లోని ఆయన నివాసంలో శాలువా, బోకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తను మంత్రిగా ఉన్నప్పటినుంచి నర్సింహారావు తన ప్రజాసేవ కార్యక్రమాల ఫొటోలు తీసే వారని గుర్తు చేశారు. ఫొటోలు తీయడమే కాకుండా పత్రికల్లో రాసేవారికి అందించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కర్నాటి లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

హాలియా : ఉమ్మడి అనుముల మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో మంగళవారం హాలియా పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చవ్వా వెంకట్‌రెడ్డి, నడ్డి మల్లేష్ యాదవ్, ఉమ్మడి అనుముల మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అధ్యక్షుడు గుండెబోయిన నాగరాజు, ఉపాధ్యక్షులు రేఖ శ్రీరామ్ యాదవ్, గడ్డమీది నాగార్జున, ప్రధాన కార్యదర్శి కట్ల రామాంజి, కోశాధికారి గురు, తదితరులు పాల్గొన్నారు.



హాలియా : లూయిస్ డాగురె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్

పలువురికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టా పొందిన తేజకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



ఇస్రో చైర్మన్ నారాయణన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న శంకరాచారి

మాడుగులపల్లి : మండలంలోని గంధ్రవానిగూడెం గ్రామానికి చెందిన కొణతం సత్యనారాయణరెడ్డి – కళావతి దంపతుల కుమారుడు కొణతం తేజకుమార్‌రెడ్డికి డాక్టరేట్ పట్టా పొందారు. అనురాగ్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని ఫార్మసీ ఫ్యాకల్టీకి చెందిన తేజకుమార్‌రెడ్డి అదే యూనివర్సిటీ నుంచి ఫార్మాస్యుటికల్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. డాక్టరేట్ పట్టా పొందిన తేజకుమార్‌రెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు శాలువాతో సన్మానించి అభినందించారు.

మాడుగులపల్లి వాసికి పీహెచ్‌డీ పట్టా

మండల కేంద్రానికి చెందిన జె.శంకరాచారి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. నైట్రోజన్, సల్ఫర్ అణువులను కలిగి ఉన్న ఫ్యూజ్డ్ హెటిరోసైక్లిక్ సమ్మేళనాల రూపకల్పన, సంశ్లేషన, వాటి ఇన్‌సిలికో అధ్యయనాలపై పరిశోధన చేసినందుకు మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మల చేతుల మీదుగా ఆయనకు పీహెచ్‌డీ పట్టా అందజేశారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శంకరాచారి పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన శంకరాచారిని గ్రామస్తులు అభినందించారు.

ఆరెగూడెం వాసికి..

గుర్రంపోడు : మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన పులకరం విష్ణు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ప్రొఫెసర్ నర్సింగారావు పర్యవేక్షణలో జియాలాజికల్, జియోఫిజికల్ అండ్ కెమికల్ స్టడీస్ ఎవాల్యువేషన్ గ్రౌండ్ వాటర్ అరౌండ్ అవుటర్ రింగ్ రోడ్డు, గ్రేటర్ హైదరాబాద్ అనే అంశంపై పరిశోధనలు చేసి గ్రంథాన్ని సమర్పించినందుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ఇచ్చి సత్కరించింది. గ్రామానికి చెందిన పులకరం అంజయ్య, అంజమ్మల కుమారుడైన విష్ణు కొప్పోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసి పట్టుదలతో ఎమ్మెస్సీ జియాలాజికల్ ఉస్మానియా యూనివర్సిటీలో చదివాడు. పర్యావరణ పరిరక్షణ పట్ల తనకు గల ఆసక్తి ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకునే చేసిందని అన్నారు. స్వంతంగా జిర్ఘెజల్ జీవన్ అనే సంస్థను స్థాపించి వాటర్ రిచార్జ్ ప్రణాళికలు, బోరు బావుల తవ్వకానికి అనువైన ప్రదేశాలను సూచించడం చేస్తున్నట్లు తెలిపారు.

బోధనోపకరణాలతో విద్యాబోధన సులభతరం

హాలియా : బోధనోపకరణాల ద్వారా ఉపాధ్యాయులు విద్యాబోధన విద్యార్థులకు చదువు సులభతరమవుతుందని హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. అనుముల మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులకు బోధనోపకరణాల టీఎల్‌ఎం మేళా శిక్షణ నిర్వహించారు. మంగళవారం శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం టీఎల్‌ఎం శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేవారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణమూర్తి, వివిధ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, నాగిరెడ్డి, ఉపాధ్యాయులువెంకటేశం, మధు, మధు, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్, రవీందర్, ప్రభాకర్‌రెడ్డి, సత్య నారాయణరెడ్డి ఉన్నారు.

దేశ భవిష్యత్ యువత చేతిలో ఉండాలి

హాలియా : యువత దేశానికి వెన్నెముక అని, రాబోయే రోజుల్లో దేశ భవిష్యత్ వారిదే కావాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం(టీఆర్‌జీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్ అన్నారు. టీఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రభుత్వం చదువులు–ప్రైవేట్ చదువులపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌జీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జటావత్ చంద్రుడు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేష్ నాయక్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నానో యూరియాతో భూసారం

మిర్యాలగూడ : నానో యూరియా వాడకంతో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ సైదానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు.నానో యూరియాను మొక్క సులభంగా గ్రహిస్తుందని తెలిపారు. నానోయూరియాతో మొక్కలు చీడపీడలను తట్టుకునే స్వభావం కలిగి ఉంటాయని, అధిక పిలకలు వచ్చి పైరు ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ వాడి పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఓలు గోపి, షఫి, రమేష్, ఆఫ్రిన్, బిందు, రైతులు ఉన్నారు.

నానో యూరియా వాడకంపై అవగాహన

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో మంగళవారం నానో యూరియా వాడకంపై మండల వ్యవసాయ అధికారిని గుర్రం సరిత రైతులకు అవగాహన కల్పించారు. నానో టెక్నాలజీతో చేయబడిన నత్రజని, ఎరువులు, సంప్రదాయ యూరియా, తదితర అంశాలపై వివరించారు.

ఉపకరణాల కోసం దరఖాస్తుల స్వీకరణ

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం వివిధ రకాలుగా వైకల్యం కలిగిన 18 సంవత్సరాల లోపు వారి నుంచి ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ డివిజన్ లోని అన్ని మండలాల నుంచి వచ్చిన వారిని వైద్యులు పరీక్షించారు. వైకల్యం కలిగిన 74 మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరవగా సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కత్తుల రవీందర్, స్పెషల ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, ఎంఈఓ లావూరి బాలు, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

ధరణి వల్లే భూసమస్యలు

పెద్దఅడిశర్లపల్లి : కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం వల్లే రైతులకు భూసమస్యలు తలెత్తాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. మంగళవారం గుడిపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాను చూస్తే దొంగే దొంగ.. దొంగ అన్నట్లుగా ఉందన్నారు. ధరణి వల్లే ప్రజలకు భూసమస్యలు ఏర్పాడ్డాయని, భూభారతితో రైతుల భూసమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సతీష్‌రెడ్డి, రామలింగం, శ్రీనివాస్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

హాలియా : ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్ నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులతో కలిసి మహాధర్నా కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమాదేవి, మండల విద్యాధికారి గుండా కృష్ణ మూర్తి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి, ప్రకాష్, దాస వెంకన్న, అనుముల మండల అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్, సయ్యద్ మియా, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

పెద్దవూర : సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనదని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌కే బషీర్ అన్నారు. మంగళవారం మండలంలోని పర్వేదుల గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సర్వే నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమావత్ భగ్గు, లచ్చు, దస్రు, వెంకన్న ఉన్నారు.